క్లుప్తంగా

దోమతెరలు పంపిణీ



దోమతెరలు పంపిణీ చేస్తున్న గంగన్న

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని గోండుగూడ వాసులకు ఆ గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న గురువారం దోమతెరలు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. స్పందన స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బండారి వెంకటేశ్, లక్ష్మణ్, పాండు, రవి తదితరులున్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సాయన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పీఆర్టీయూ నాయకులు హరిప్రసాద్, శంకర్, రవిరాజ్, సాయిబాబు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కుంటాలలో భారీ వర్షం



కల్లూరు చెక్‌డ్యాంపై నుంచి వెళ్తున్న వరద

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. ఎగువ కురిసిన వర్షాలతో కల్లూరు చెక్‌డ్యాంపై నుంచి వరద ప్రవహించింది. మండలంలో 5 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

మినీ గురుకులం సందర్శన

మామడ: మండల కేంద్రంలోని మినీ గురుకులం పాఠశాలను గురువారం ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలల పరిసరాలు, విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయురాలు నీల ఉన్నారు.

వీల్‌చైర్ అందజేత

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో పెరగాని నరేశ్ అనే దివ్యాంగుడికి మాజీ ఎంపీటీసీ కట్ల సింధూజ సాగర్ గురువారం వీల్ చైర్ అందజేశారు. తిరుపతి, వెంకన్న, నాగరాజు చారి, శ్రీను, రాజు, గ్రామపెద్దలు రాజన్న, భూషన్న, నారాయణ, బుచ్చన్న, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

ఆటో యూనియన్ దినోత్సవం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో గురువారం ప్రపంచ ఆటో యూనియన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆటోడ్రైవర్ల జీవన విధానం, ప్రభుత్వ నిబంధనలపై మాట్లాడారు. టీకు మధు, రాజేశ్వర్, శంకర్, లచ్చన్న, నరేశ్, సతీశ్, కాలేరి విలాస్, కుమార్ ఉన్నారు.

నిజాయతీ చాటిన రైతన్న

బాసర: మండల కేంద్రానికి చెందిన దొడ్లే చందర్ అనే రైతు తనకు దొరికిన రూ.80వేల విలువైన ఐఫోన్‌ను యజమానికి అందించి నిజాయతీ చాటుకున్నాడు. బాసరకే చెందిన గారోళ్ల విజయ్‌కుమార్ తన ఐఫోన్ 15ను పోగొట్టుకోగా చందర్‌కు దొరికింది. దీంతో సదరు రైతు విజయ్‌కుమార్‌కు ఫోన్ అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు.

డ్రాగన్‌ఫ్రూట్ తోట పరిశీలన

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కదం హరిపాటిల్ అనే రైతు తన ఎకరంన్నర భూమిలో సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ తోటను గురువారం ఎంపీడీఓ అరుణారాణి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు యువరైతులు ముందుకు రావాలని పేర్కొన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. ఇందులో ఈజీఎస్ ఏపీఓ దివ్యారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

తానూరు: ఎమ్మెల్యే రామారావుపటేల్ ప్రసంగాన్ని వక్రీకరిస్తూ వాట్సప్‌లో ఫార్వడ్ చేస్తున్న కొందరు కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. గురువారం తానూరులో మాట్లాడారు. అనంతరం ఏఎస్సై భానుకు ఫిర్యాదు చేశారు. శివాజీపటేల్, బద్రే సాయినాథ్, సోమ్‌నాథ్, దేవిదాస్, మారుతి, బాలాజీ, తదితరులు ఉన్నారు.

సోయా పంట పరిశీలన

కుంటాల: మండలంలోని అందాకూర్ శివారులో సాగు చేసిన సోయా పంటను గురువారం ఏఈవో గణేశ్ పరిశీలించారు. పంటను కాండం తొలుచు పురుగు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 8కిలోలు ఇసుకతో కలిపి వెదజల్లాలని ఏఈవో సూచించారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- దిలావర్‌పూర్‌లో అధ్వానంగా పారిశుధ్యం
- పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులు
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- దోమల నివారణకు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



దిలావర్‌పూర్‌లో ఒకటో వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవలి వర్షాలకు ఖాళీస్థలాలు, ఇళ్ల మధ్య నీరు నిలువడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలతోపాటు సాధారణ జ్వరాల బారిన పడుతూ ప్రజలు అల్లాడుతున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య చర్యలు చేపట్టడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. మరోవైపు ప్రజలు సైతం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడంతో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దిలావర్‌పూర్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టి.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

భయాందోళనలో ప్రజలు..

మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లో మొత్తం 14 వార్డులుండగా జనాభా సుమారు 9వేలు. ఒక్కో వార్డులో 685 నుంచి 800 మంది వరకు ఉంటారు. ఇటీవలి వర్షాలకు వార్డుల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో జ్వరాలు విజృంభించాయి. కొద్ది రోజుల్లోనే సుమారు 50 మందికిపైగా డెంగీ, మలేరియా ఇతర జ్వరాల బారిన పడ్డారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఆసుపత్రులకు క్యూ కడుతున్న జనం..



నిర్మల్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

వారం రోజుల కిందట దిలావర్‌పూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి 30 మంది వరకు జ్వరాల బారిన పడినట్లు గుర్తించగా.. ప్రస్తుతం ఆసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మండల కేంద్రంలో ఇప్పటికే 100 మందికిపైగా జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొందరు ఇళ్ల వద్దనే ఆర్‌ఎంపీల ఆధ్వర్యంలో చికిత్స పొందుతుండగా.. మరికొందరు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోతున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది..

వార్డుల్లో పారిశుధ్యం పేరుకుపోతున్నా.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇళ్ల మధ్య ఉన్న మురికి గుంటలు, ఖాళీస్థలాల్లో నిలిచిన నీరు, చెత్తాచెదారం దోమలకు ఆవాసాలుగా మారాయి. ఇప్పటికైనా గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు వైద్యారోగ్యశాఖ అధికారులను వేడుకుంటున్నారు.

పారిశుధ్య చర్యలు చేపడుతాం

దిలావర్‌పూర్‌లో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఓపెన్ ప్లాట్లలో నిలిచిన నీరు తొలగించాలని యజమానులకు సమాచారమిచ్చాం. వారు స్పందించకుంటే చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది శానిటేషన్ చేస్తున్నారు. స్థానిక అధికారులు దగ్గరుండి సమస్య పరిష్కరించేలా చూస్తాం.

– జిల్లా పంచాయతీ అధికారి

పట్టించుకోవడం లేదు..



ఒకటో వార్డులో ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో నీరు, చెత్తాచెదారం నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతూ మేం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

– సతీశ్‌గౌడ్, దిలావర్‌పూర్

సమస్య పరిష్కరించాలి



ఒకటి, రెండు వార్డుల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. రెండేళ్లలో మా కుటుంబం లక్షలాది రూపాయలను ఆసుత్రుల్లో ఖర్చు చేశాం. ఇళ్ల మధ్య చెరువును తలపించేలా నీరు నిలుస్తుండటంతో దోమలు పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి వార్డుల్లో సమస్యను పరిష్కరించాలి.

– గామ్ గంగారం, దిలావర్‌పూర్

జ్వరాలు తగ్గుముఖం పట్టేలా చర్యలు

రెండు రోజుల కిందటే బాధ్యతలు స్వీకరించా. వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. జ్వరాలతో నిత్యం 50 మందికి పైగా వస్తున్నారు. వీరికి మలేరియా, డెంగీ పరీక్షలు చేయిస్తున్నాం. పరీక్షల్లో నెగెటివ్ వచ్చినా పలువురు కీళ్ల నొప్పులతో బాధపడుతుండటంతో మందులు అందిస్తున్నాం. కొందరు ప్రైవేటు ఆసుత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టి జ్వరాలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకుంటాం.

– విశ్వేశ్వర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, దిలావర్‌పూర్

పరీక్ష మెటీరియల్ అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు అవసరమైన మెటీరియల్‌ను ఉపాధ్యాయుడు ఎండీ ఆదిల్ సమకూర్చగా ప్రధానోపాధ్యాయుడు మోహన్ అందజేశారు. ఉపాధ్యాయులు రవికుమార్, గంగసురేశ్, ఆదిల్, ప్రమోద్, పోశెట్టి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్

సారంగాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ మారుతి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శంకర్ వచ్చారు.

'సీతక్కపై వ్యాఖ్యలు సరికాదు'

ముధోల్: అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.. మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ముధోల్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ రామ్‌నాథ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక బ్యాగు ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో కార్యాలయానికి రావాలని సూచించారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు

సారంగాపూర్: మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలలతోపాటు సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఏబీవీపీ మండల కన్వీనర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో తాము ముందుంటామని పేర్కొన్నారు. గణేశ్, నరేశ్, బన్నీ, వంశీ ఉన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



దిలావర్‌పూర్: మాట్లాడుతున్న ఎంపీవో గోవర్ధన్



సోన్: న్యూవెల్మల్‌లో మాట్లాడుతున్న జ్యోతి

తానూరు: తల్లిపాలు అమృతంతో సమానమని.. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. గురువారం మండలంలోని బోసి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలవారోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని మాడేగాం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. దీనికి ఎంపీవో గోవర్ధన్ హాజరై మాట్లాడారు. తల్లిపాలు తాగడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూనాంబ, టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ అంగన్‌వాడీ కేంద్రం–1, 2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడారు. పుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, రమాదేవి, వీఓఏ సునీత, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

'ఎన్నికల హామీలు అమలు చేయండి'



ఖానాపూర్: ధర్నాలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014 నుంచి బీడీ కార్మికులకు నూతన పెన్షన్లు మంజూరు కావడం లేదన్నారు. మద్ది నర్సయ్య, గంగామణి, లక్ష్మి, కవిత, కమల, రజిత, పి.లక్ష్మి పాల్గొన్నారు.

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం పార్టీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పోడు సాగుదారులకు హక్కుపత్రాలు, అర్హులకు రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంతకముందు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. రాజన్న, అంకుశ్‌రావు, ఎల్లయ్య, దాదాబాయి తదితరులున్నారు.

'మహిళా ఎమ్మెల్యేలపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి'



ఖానాపూర్ : నిరసనలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు బైక్ ర్యాలీగా వచ్చి తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఎం మాటలు మహిళా లోకాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని.. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజగంగన్న, రాజు, మోహిద్, ప్రదీప్, సుమన్, శ్రావణ్, నరేందర్, కళావతి, అర్షద్, ఎర్రన్న, రంజిత్, దివాకర్, పిరాజీ, ధర్మరాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

నిర్మల్‌రూరల్: మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు సుభాశ్‌రావు, పూదరి నరహరి, నజీర్, అక్రమ్, అనిల్, ఆకాశ్, వికాస్, రిజ్వాన్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలకు అవమానకరమని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పెంటవార్ దశరథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూరులో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మచ్చ రజినీకాంత్, దత్తు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



బాసరలో సంబురాలు చేసుకుంటున్న నేతలు



కడెం : హర్షం వ్యక్తం చేస్తున్న మాదిగ కులస్తులు

బాసర: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బాసరలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ యూత్ యువజన సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగ్జీవన్ రామ్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాదిగ యూత్ యువజన సంఘం నాయకులు బిద్దూరు రమేశ్, మాజీ సర్పంచ్ సతీశ్‌రావు, సాయినాథ్, పుట్నాల సాయినాథ్ పటేల్, దేవన్న, మల్లెల మోజేశ్, నాగరాజ్, సాయి, అశోక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు, సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను అమలు చేస్తామని తెలపడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, భూషణ్, రాజు, తదితరులు ఉన్నారు.

కుంటాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని నాయకులు మగ్గిడి దిగంబర్, పెంటవార్ దశరథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



సోన్: మొక్కలు నాటిస్తున్న డీఎల్‌పీఓ రమేశ్

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం మండలంలోని గొడిసెరాలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్, కార్యదర్శి గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు దేవిక తదితరులున్నారు.

సోన్: మండలంలోని గంజాల్‌లో రెండు పడక గదుల ఇండ్ల వద్ద, న్యూవెల్మల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో డీఎల్‌పీఓ రమేశ్ మొక్కలు నాటించారు. న్యూవెల్మల్ పాఠశాలతోపాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఏపీవో మంజుల రెడ్డి, ఏపీఎం ఖలీల్ హైమద్, కృష్ణ, భూపాలరెడ్డి, రాణి, హెచ్‌ఎం నర్సారెడ్డి, ఉపాధ్యాయులు వందన, కృష్ణవేణి, లక్ష్మణ్, సాయన్న పాల్గొన్నారు.

కుంటాల: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఏపీవో గట్టుపల్లి నవీన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంబకంటి తండాలో మొక్కలు నాటారు. కార్యదర్శి సతీశ్, గ్రామస్తులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

లోకేశ్వరం: రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని భైంసా డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని మన్మద్ గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతివనం, పాఠశాలలో మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, నాటిన మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి మాలతి, ప్రధానోపాధ్యాయుడు ముత్తన్న ఉన్నారు.

కుంటాల: వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. గురువారం మండలంలోని సూర్యాపూర్‌లో ఆయన పర్యటించారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా మురికినీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో మొక్కలను నాటించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు ఉన్నారు.

అన్నాభావుసాఠేను ఆదర్శంగా తీసుకోండి



బోసిలో పూలమాలలు వేస్తున్న నాయకులు



లోకేశ్వరం : పుస్పూర్‌లో..

తానూరు: అన్నాభావుసాఠేను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావు అన్నారు. గురువారం మండలంలోని బోసి గ్రామంలో అన్నాభావుసాఠే జయంతి నిర్వహించారు. సాఠే విగ్రహానికి నివాళులర్పించారు.చంద్రకాంత్‌యాదవ్, భోజారాం పటేల్, గంగాధర్, పోశెట్టి, లక్ష్మణ్, సాహెబ్‌రావు, సాయినాథ్, సురేఖ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంతోపాటు పుస్పూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. అన్నబావు సాఠె ముధోల్ నియోజకవర్గ సభ్యుడు బండి ప్రశాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవన్న, సాయన్న, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. అన్నబావుసాఠే యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రుణమాఫీపై సంబరాలు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌తండాలో గురువారం రుణమాఫీ చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రాంనాథ్‌నాయక్, పోతారెడ్డి, గజానంద్, మోతీరాం, గులాబ్ పాల్గొన్నారు.

నేటిలోగా ప్రవేశం పొందాలి

ముధోల్: ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం లోగా ప్రవేశం పొందాలని వెనుకబడిన తరగతుల సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. మున్నూరుకాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోళ్ల రమేష్, నారాయణ, మేత్రి సాయినాథ్, రమేశ్, సాయినాథ్, గంగాధర్, విఠల్, లింగన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాసర ఆలయ ఈఓకు అదనపు బాధ్యతలు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి విజయ రామారావు నిజామాబాద్ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. వారికి శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ వైదిక బృందం ప్రవీణ్ పాటక్, సంజీవ్, నవీన్ శర్మ, ఏఈఓ సుదర్శన్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ

ఖానాపూర్:మండలంలోని గోసంపల్లెలో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన వృద్ధురాలి కుటుంబసభ్యులను, నడింపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్‌తోపాటు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతల్‌పేట్‌కు చెందిన నరేశ్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్‌నాయక్ పరామర్శించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

'కళాకారులకు గుర్తింపేది'

ముధోల్: రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినప్పటికీ కళాకారులకు గుర్తింపు లేదని ప్రజాగాయకుడు ఆష్ట దిగంబర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ఈ ప్రభుత్వమైనా కళాకారులను ఆదుకోవాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే బలోపేతం

భైంసారూరల్: ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని చుచుంద్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామవిద్య ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. హెచ్‌ఎం సురేశ్, గణపతి, పండరి, పద్మ పాల్గొన్నారు.

న్యాస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులకు న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)పై శిక్షణ కార్యక్రమాన్ని మండల నోడల్ అధికారి అశోక్‌వర్మ అధ్యక్షతన నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లు లక్ష్మణ్‌రెడ్డి, నారాయణ.. ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. నవంబర్‌లో నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచడం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేశారు. రిసోర్స్ పర్సన్లు వి.సుదర్శన్, గంగాసురేశ్, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో భైంసా, లోకేశ్వరం కుంటాల మండలాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు జీవశాస్త్ర సముదాయ సమావేశం నిర్వహించారు. న్యాస్‌పై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేశ్వర్, కోర్సు డైరెక్టర్లు శైలజ, గంగాధర్, సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.